క్లుప్తంగా

మారుమోగిన అఖండ నామ సంకీర్తనలు



చల్లపల్లి: స్థానిక అవతార్ మెహెర్ బాబా మందిరంలో రెండో రోజు కూడా అఖండ నామ సంకీర్తనలు మారుమోగాయి. 60 వసంతాల వార్షికోత్సవం సందర్భంగా స్థానిక బాబా ప్రేమిక బృందం ఆధ్వర్యంలో 60 గంటల పాటు నిరవధిక అఖండ బాబా నామ సంకీర్తనల కార్యక్రమాన్ని చేపట్టారు. ఈనెల 29వ తేదీ ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన కీర్తనలు ఆదివారం సాయంత్రం ఏడు వరకు జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు చుండూరి ఎం.వి.ఆర్.కె.సత్యప్రసాద్ తెలిపారు.

దృఢ సంకల్పంతోనే లక్ష్య సాధన



చల్లపల్లి: విద్యార్థులకు దృఢమైన సంకల్పం ఉన్నప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధిస్తారని జనవి/జ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. విజయక్రాంతి జూనియర్, డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థులకు శనివారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో 'గెలవడానికి మీకో ప్రపంచం ఉంది' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం కళాశాలల కరెస్పాండెంట్ దుట్టా శివరామప్రసాద్ బ్రహ్మారెడ్డి, ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావును సత్కరించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి కె.జి.చంద్రరావు, రాష్ట్ర నాయకుడు విశ్వనాథ్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది



పెడన: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని నందమూరు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం మద్ది బాబు రాజేంద్రప్రసాద్ అన్నారు. పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ చేసిన బీటీ నాగేశ్వరరావు అభినందన సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులకు విలువలు నేర్పించడంతో పాటు ఉజ్వలమైన భవిష్యత్తు కోసం నాగేశ్వరరావు మార్గనిర్దేశం చేశారని ప్రశంసించారు. అనంతరం ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బృందగాన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గుడివాడ టౌన్: భారత్ వికాస్ పరిషత్ గుడివాడ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ బృందగాన పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి మూడో స్థానం సాధించారని విద్యావికాస్ పాఠశాల డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావు తెలిపారు. స్థానిక సత్యనారాయణపురంలోని ఉపద్రష్ట బ్రాహ్మణ సత్రంలో శనివారం జరిగిన ఈ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులు హిందీ బృందగానంలో ఈ బహుమతి సాధించారని తెలిపారు.

ఆక్రమణలో పార్కు స్థలం

దాదాపు రూ. 8 కోట్ల విలువైన స్థలం

- ప్రత్యామ్నాయ పట్టా స్థలాలు ఉన్నా ఖాళీ చేయని వైనం
- పట్టించుకోని నగరపాలక సంస్థ అధికారులు

మచిలీపట్నంటౌన్: కోట్లాది రూపాయల విలువైన పార్కు స్థలం ఆక్రమణలకు గురవుతున్నా నగరపాలక సంస్థ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నగరంలోని 41వ డివిజన్ బలరామునిపేట పాలకుర్తివారి లేఅవుట్‌లోని పేదల కాలనీలో గల పార్కు స్థలాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఫలితంగా దాదాపు రూ. 8 కోట్లు విలువ చేసే అర ఎకరం పార్కు స్థలం అక్రమార్కుల పాలైంది. ఈ పార్కులో గృహాలు నిర్మించుకున్న వారికి వేరే ప్రాంతాల్లో ప్రభుత్వం ఇచ్చిన పట్టా ఇళ్ల స్థలాలు ఉన్నా ఈ గృహాలను ఖాళీ చేయని పరిస్థితి నెలకొంది. పార్కులో ఆక్రమిత స్థలాలను కొంత మంది లక్షలాది రూపాయలకు విక్రయించుకుంటున్నారు. మరికొంత మంది నిర్మించిన గృహాలను అద్దెకు ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

అధికారుల తీరుపై ఆగ్రహం

ఈ లేఅవుట్‌ని అనుకుని ఉన్న కుమ్మరిగూడెంలో దాదాపు 200 మంది పేదలు గృహాలు నిర్మించుకుని జీవిస్తుంటే ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా పోలీసు బందోబస్తు నడుమ గృహాలను నేలమట్టం చేసి ఖాళీ చేయించిన కార్పొరేషన్ అధికారులు ఈ పార్కు స్థలాన్ని ఎందుకు ఖాళీ చేయించరని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అలాగే రాజీవ్ నగర్‌లో ప్రైవేట్ స్థలంలో ఆ ప్రాంత పేదలు నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తుంటే వాటిని కూడా కూల్చేందుకు పూనుకున్న అధికారులు తమ పార్కు స్థలంలో ఉన్న ఆక్రమణలను ఎందుకు తొలగించరని ప్రశ్నిస్తున్నారు. నగరంలోని రోడ్డు మార్జిన్లలో దుకాణాలను, ఆక్రమణలను నిర్దాక్షిణ్యంగా తొలగించి తమ ప్రాంతంలోని పార్కు స్థలాన్ని మాత్రం వదిలేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పార్కును అభివృద్ధి చేయాలని డిమాండ్

ఇక్కడ నివాస గృహాలు నిర్మించిన వారిలో ఎక్కువ మంది హైదరాబాద్, విజయవాడతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉంటూ ఇక్కడ గృహాలను అద్దెకు ఇచ్చి ప్రతి నెలా వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఈ ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. నగరంలోని ఇతర ప్రాంతాల వారికి ఒక న్యాయం.. తమ ప్రాంతానికో న్యాయం చేయడం అధికారులకు తగదని వారు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించి తమ ప్రాంతంలో ఆక్రమణకు గురైన ఈ స్థలాన్ని ఖాళీ చేయించి పార్కు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.




పాలకుర్తి వారి లేఅవుట్‌లోని పార్కు స్థలంలో ఉన్న నివాసాలు



పార్కు స్థలంలో నూతనంగా నిర్మిస్తున్న గృహం

యథేచ్ఛగా గృహ నిర్మాణాలు

1991–92లో నాటి స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పేర్ని కృష్ణమూర్తి పాలకుర్తి వారి నుంచి ప్రభుత్వం ద్వారా ఈ భూమిని కొనుగోలు చేసి లేఅవుట్‌గా ఏర్పాటు చేశారు. నాడు స్థలంలో దాదాపు 200 మంది పేదలకు పట్టాలు ఇచ్చి స్థలాలను పంపిణీ చేశారు. నాడు ఈ ప్రాంతంలోని వారికి పార్కుగా వినియోగించేందుకు దాదాపు 50 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. అయితే ఈ పార్కు స్థలాన్ని కొంతమంది కొన్నేళ్లుగా ఆక్రమిస్తూ గృహాలు నిర్మించారు. గత ప్రభుత్వంలో ఇక్కడ అర్హులకు జగనన్న కాలనీలో కూడా నివేశన స్థలాలు ఇచ్చారు. కానీ ఈ స్థలాన్ని ఖాళీ చేయించి పార్కుగా అభివృద్ధి చేయడంలో నగరపాలక సంస్థ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని నగర ప్రజలు విమర్శిస్తున్నారు. ఇక్కడ ఆక్రమణలను తొలగించి పార్కును అభివృద్ధి చేస్తే తమకు, తమ పిల్లలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు కోరుతున్నారు.



కోడూరులో వినాయకుడు



కృత్తివెన్ను మండలం గాంధీనగరంలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు



మచిలీపట్నంలో లాల్‌బాగ్ కా బాదుషా గణపతి



మోపిదేవి దేవస్థానంలోని గణపతి విగ్రహాన్ని ఊరేగిస్తున్న ఆలయ అధికారులు



చల్లపల్లిలో మట్టి వినాయకుని ఊరేగింపులో చిన్నారుల సందడి

ఉత్సాహంగా చవితి వేడుకలు

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన గణనాథుడి మండపాల వద్ద నవరాత్రి ఉత్సవాలు భక్తిప్రపత్తులతో కొనసాగుతున్నాయి. శనివారం కొన్ని మండపాల్లో ఉత్సవాలను ముగించి లంబోదరుడిని నిమజ్జనాలకు తరలించారు. పలు చోట్ల ఉత్సవ కమిటీ సభ్యులు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. పలు పందిళ్ల వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

– సాక్షి నెట్‌వర్క్

పోలీసుశాఖలో నిజాయితీ ముఖ్యం

జిల్లా ఎస్పీ గంగాధరరావు

కోనేరుసెంటర్: పోలీసుశాఖలో పనిచేసే ఉద్యోగుల్లో నిజాయితీ అనేది చాలా ముఖ్యమని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ నుంచి ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందిన పీవీఎల్ఎస్ కుమారి, జూనియర్ అసిస్టెంట్ నుంచి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన ఎం.విద్యాసాగర్‌లను శనివారం ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోన్నతి పొందిన సిబ్బంది తమ విధులను మరింత నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ వీవీ నాయుడు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌చార్జ్ సీఐ వాకా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



పదోన్నతి పొందిన కుమారిని అభినందిస్తున్న ఎస్పీ గంగాధరరావు

ఉద్యమ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

జిల్లా పరిశ్రమల కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్

ఘంటసాల: ప్రభుత్వ రంగంలోని ఎంఎస్ఎంఈలకు అందించే వివిధ రుణాలు, సబ్సిడీలు పొందాలంటే ఉద్యమ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరని కృష్ణాజిల్లా పరిశ్రమల కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ పి.ప్రదీప్ కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు, వారికి వివిధ రాయితీలు అందించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ ప్రోత్సాహకాలను ఉపయోగించుకుని ఎంఎస్ఎంఈ సెక్టార్ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రతి పారిశ్రామిక, వ్యాపారవేత్త తమ యూనిట్లకు సంబంధించి ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా పొందాలని సూచించారు. పరిశ్రమల ప్రోత్సాహక అధికారి వై.నాగేంద్ర భూపాల్ మాట్లాడుతూ మండలంలో 30 మందికి రిజిస్ట్రేషన్లు చేశామని వీరికి త్వరలోనే సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి.సుబ్బారావు, వ్యాపారస్తులు, అధికారులు పాల్గొన్నారు.



ఉద్యమ్ రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న నాగేంద్ర భూపాల్

వాడివేడిగా కౌన్సిల్ సమావేశం

పెడన: మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సాధారణ సమావేశం వాడివేడిగా జరిగింది. తొలుత అజెండాలోని తొమ్మిది అంశాలను పాలకులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం జరిగిన చర్చల్లో పట్టణంలో ఆశీల పాటదారుడు సెక్యూరిటీ డిపాజిట్ కింద నాలుగో వంతు చలానా కట్టాల్సి ఉందని, అలాగే మిగిలిన మొత్తానికి తనఖా రిజిస్ట్రేషన్ చేయించాల్సి ఉందని, అటువంటి చర్యలు ఏమైనా తీసుకున్నారా లేదా తెలియజేయాలని 19వ వార్డు కౌన్సిలర్ శిరివెళ్ల జయేష్ చైర్‌పర్సన్ ద్వారా మున్సిపల్ అధికారులను అడిగారు. ఎటువంటి సమాధానం ఇవ్వకుండా ప్రశ్నను దాటవేసేందుకు యత్నించడంతో కౌన్సిలర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నాలుగు సమావేశాలు నుంచి ఇదే ప్రశ్న లేవనెత్తుతున్నా సరైన సమాధానం ఇవ్వడం లేదన్నారు. అధికారులు సమాధానం ఇచ్చే వరకు కౌన్సిల్ హాలు నుంచి కదిలే ప్రసక్తి లేదన్నారు. కమిషనర్ చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ సెక్యూరిటీ డిపాజిట్‌గా చలానా కట్టారని, మిగిలినవి అగ్రిమెంట్ కోసం తనఖా రిజిస్ట్రేషన్ సెప్టెంబరులోగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. సెప్టెంబరులోగా సెక్యూరిటీగా తనఖా రిజిస్ట్రేషన్ చేయకపోతే ఆశీల పాటను రద్దు చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే పీఏ పెత్తనం

ఎటువంటి చలానాలు కట్టకుండా వాటర్ ట్యాంకులు బయటకుపోతున్నాయని జనసేన కౌన్సిలర్ శివపావని చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే పీఏ ఫోన్ చేసి ట్యాంకులు పంపించాలని చెబుతున్నారని, అందుకే పంపించామని చైర్‌పర్సన్ సమాధానం ఇచ్చారు. ఆగస్టులో ఎన్ని చలానాలు వచ్చాయన్న ప్రశ్నకు రెండు మాత్రమే వచ్చాయని, చలానాలు కడితేనే ఇస్తామనే విషయాన్ని కూటమి ఎమ్మెల్యే పీఏకు చెప్పాల్సిందిగా మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎండీ ఖాజా పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ బైలపాటి జ్యోతి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మేనేజర్ రాజా, టీపీవో సుజనకుమారి తదితరులు పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్, సభ్యులకు సమాధానం ఇస్తున్న కమిషనర్ చంద్రశేఖరరెడ్డి

రక్తహీనతపై అవగాహన

ఘంటసాలపాలెం(ఘంటసాల): ఘంటసాల మండలం ఘంటసాలపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చర్ కాలేజ్, కమ్యూనిటీ సైన్స్ విద్యార్థినులు అనేమియా (రక్తహీనత)పై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఐరన్, విటమిన్ సి, ఆకుకూరలు, పప్పులు, మాంసాహారం వంటి పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా అనేమియాను నివారించవచ్చునని వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు కె.కనకదుర్గ, ఎస్.మానస, ఎం.ఉమాదేవి, జె.రాజ్యలక్ష్మి, పి.హేమలత, ఆయాలు, మహిళలు పాల్గొన్నారు. అలాగే ఘంటసాల నందం బజారులోని అంగన్‌వాడీ కేంద్రంలో సామాజిక విజ్ఞాన కళాశాల రావె విద్యార్థినులు పిల్లల పెంపకంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ సునీత, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.



ఘంటసాలపాలెంలో అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

శివాలయానికి వెండి వస్తువులు బహూకరణ

బంటుమిల్లి: మండలంలోని కంచడంలో ఉన్న శ్రీకాత్యాయని సమేత కనకలింగేశ్వరస్వామి(శివాలయం)కి శనివారం భక్తులు సుమారు రూ. లక్ష విలువ చేసే వెండి శఠగోపం, పళ్లెం బహూకరించారు. గ్రామానికి చెందిన గుడిశేవ మామిళయ్య కుమార్తె సీతాల ధనలక్ష్మి పామర్రు మండలం, జమిదగ్గుపల్లి గ్రామంలో స్థిరపడ్డారు. ఈ క్రమంలో ధనలక్ష్మి, హనుమంతరావు దంపతులు స్థానిక శివాలయంలో స్వామి మొక్కు తీర్చుకునే భాగంలో గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి బండారు చంద్రశేఖర్ సమక్షంలో వెండి వస్తువులను ఆలయ అర్చకులకు అందజేశారు. కార్యక్రమంలో ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి వెండి శఠగోపం, పళ్లెం బహూకరించిన దాతలు

35 మంది రక్తదానం

చల్లపల్లి: శ్రీమంతురాజా యార్లగడ్డ శివరామప్రసాద్ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో గురువు తగిరిశ సాంబశివరావు మాష్టారు గౌరవార్థం ఇండియన్ రెడ్‌క్రాస్ సహకారంతో స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు శిబిరాన్ని ప్రారంభించారు. 35 మంది పూర్వ విద్యార్థులు, వివేకానంద డిగ్రీ కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. గతంలో రక్తదానం చేసిన పూర్వ విద్యార్థులకు తహసీల్దార్ డి.వనజాక్షి చేతుల మీదుగా ప్రసంశాపత్రాలు అందజేశారు. రెడ్‌క్రాస్ చల్లపల్లి సబ్‌బ్రాంచ్ చైర్మన్ నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, వైస్‌చైర్మన్ పేరం మధుసూధనరెడ్డి, కోశాధికారి ఎం.డి.ఎ.కె.జిలాని, పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి బీడీఆర్ ప్రసాద్, సభ్యులు అడ్డాడ ప్రసాద్, ఆకుల సుధీర్‌కుమార్, కస్తూరి విజయ్ శిబిరాన్ని పర్యవేక్షించారు. మెడికల్ ఆఫీసర్ కె.శివప్రసాద్, కోర్డినేటర్ ఎన్.హరికృష్ణ, వివేకానంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పెమ్మసాని రమేష్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న పూర్వ విద్యార్థులు

టీడీపీలో భగ్గుమన్న విభేదాలు

బంటుమిల్లి: టీడీపీ మండల అధ్యక్షుని ఎన్నిక వివాదం అధిష్టానానికి చేరింది. శనివారం స్థానిక మండల పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో మండల అధ్యక్షుని ఎన్నుకోవలసి ఉంది. పరిశీలకునిగా వచ్చిన గొట్టుముక్కల రఘురామరాజు, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాదుల పర్యవేక్షణలో జరిగిన సమావేశంలో ప్రస్తుత అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబును తొలగించాలని ఒక వర్గం ధ్వజమెత్తింది. తనకు మండల అధ్యక్ష పదవి కావాలంటూ అంగర రంగనాథ్ పట్టుపట్టడంతో వివాదం తలెత్తింది. దీంతో ఎమ్మెల్యే, పరిశీలకులు ఇద్దరు కలసి గ్రామాల వారిగా అభిప్రాయ సేకరణ చేశారు. దీనిపై స్పందించిన పరిశీలకుడు రఘురామరాజు నివేదిక అధిష్టానానికి ఇస్తామని తుది నిర్ణయం వారిదే అన్నారు. అయితే రంగనాథ్‌ను బలపరచిన పలువురు ప్రముఖులు గతంలో పీఆర్పీ, జనసేన తదితర పార్టీలు మారినవారు కావడంతో వారికి పదవి చేయాలని ఆశతోనే బీసీ వర్గం నుంచి రంగనాథ్‌ను ముందుకు నెట్టారని కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే బీసీ కావడంతో మండల పార్టీ అధ్యక్ష పదవి మొదటి నుంచి కాపు సామాజిక వర్గానికే టీడీపీ కేటాయిస్తు వచ్చింది. ప్రస్తుత అధ్యక్షుడు వీరబాబు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలసి పనిచేయడం పార్టీలు మారినవారికి కంటకింపుగా మారిందని కార్యకర్తలు ఆరోపించారు.

నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు

శ్రీకాకుళం(ఘంటసాల): రెవెన్యూ, పోలీసులు, పంచాయతీ అధికారుల సమన్వయంతో శ్రీకాకుళంలోని కృష్ణానది వద్ద వినాయకుని విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ తెలిపారు. ఘంటసాల మండలంలో శ్రీకాకుళం గ్రామం వద్ద వినాయక నిమజ్జనాలు జరిగే ప్రాంతాన్ని రెవెన్యూ, పోలీసులు, పంచాయతీ అధికారులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వినాయకుని విగ్రహాలను నిమజ్జనానికి తీసుకొచ్చే భక్తులు పోలీసుల నిబంధనలు పాటించి అధికారులకు సహకరించాలని కోరారు. ఎస్‌ఐ కె.ప్రతాప్ రెడ్డి, ఆర్‌ఐ కె.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

గుడివాడ టౌన్: రాజీమార్గంలో కేసుల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన లోక్ అదాలత్ జయప్రదం చేయాలని జిల్లా జడ్జి గుట్టల గోపి కోరారు. శనివారం స్థానిక కోర్టు హాలులో లోక్ అదాలత్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులకు ఇబ్బంది కలుగకుండా రాజీమార్గంలో కేసులు పరిష్కరించే ఈ విధానం మంచి ఫలితాన్ని ఇస్తుందన్నారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మెడిటేషన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో 11వ అదనపు జిల్లా జడ్జి జి. సుబ్రహ్మణ్యం, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.వాసువేవ్, జూనియర్ సివిల్ జడ్జి పి. గాయత్రి, మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి డి. అరుంధతి, గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.